సాక్షి
చిత్తూరు

ఆదివారం । 15 । జూన్ । 2025



చివరి దశకు అయ్యోర్ల బదిలీలు
ఎస్జీటీ ఉపాధ్యాయుల బదిలీలు చివరి దశకు చేరాయి. నేటితో ఈ ప్రక్రియను ముగించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. - IIలో



రోడ్డెక్కిన మామిడి రైతులు
మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలంటూ రైతులు రోడ్డెక్కారు. తోతాపురి కిలో రూ.8 చొప్పున కొనుగోలు చేయాలన్నారు. - IIలో



కాణిపాకం కిటకిట
కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు క్యూలో నిరీక్షించడం కనిపించింది. - IIలో

న్యూస్‌రీల్

సెలవులో కలెక్టర్



ఇన్‌చార్జి కలెక్టర్‌గా విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్ : వ్యక్తిగత పనుల నిమిత్తం కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ ఈనెల 20వ తేదీ వరకు సెలవు పెట్టారు. ఈ మేరకు ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా జేసీ విద్యాధరికి అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. సెలవులు పూర్తయ్యి తిరిగి విధుల్లో చేరే వరకు జాయింట్ కలెక్టర్ అధనపు బాధ్యతలను నిర్వర్తించనున్నారు.

మామిడి కిలో రూ.8కే కొనాలి



సభలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

కాణిపాకం: జిల్లాకు నేనొచ్చాను..ఇకపై కేజీ మామిడి రూ.5,6,7 అంటే కుదరదు...కచ్చితంగా రూ.8కు కొనాల్సిందేనన్ని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. చిత్తూరు నగరం మంగసముద్రం ప్రాంతంలోని ఎంఎల్ఎస్ పాయింట్ ఆవరణలో శనివారం సాయంత్రం మామిడి రైతులు, గుజ్జు పరిశ్రమ దారులతో ముఖాముఖి నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ జిల్లాలోని ఫ్యాక్టరీ యజమానులతో చర్చించామన్నారు. అన్ని కంపెనీలు కూడా కేజీ రూ.8కు కొనాల్సిందేనన్నారు. చెక్‌పోస్టులు పెట్టి జిల్లా రైతులకు న్యాయం చేస్తామన్నారు. మామిడి రైతులకు రూ.168 కోట్లు సబ్సిడీ రూపంలో అందజేస్తున్నామన్నారు. తొలుత మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మంగసముద్రం యార్డు పరిస్థితిని మంత్రికి వివరించారు. చిత్తూరు నడిబొడ్డున్న ఉన్న కూరగాలయ మార్కెట్ వల్ల ఆస్పత్రికి వెళ్లేందుకు ఇబ్బందికరంగా ఉందన్నారు. అసంపూర్తిగా నిలిచిన పనులను పూర్తి చేసేందుకు రూ.7.50 కోట్లు మంజూరు చేయాలని వినతి చేశారు. మామిడిలో దళారీ వ్యవస్థ వల్ల కేజీ రూ.5,6 పలుకుతోందని, రూ. 8కి కొనుగోలు చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు రాజన్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక ఎంపీ డీ.ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, ఎక్స్ సర్వీస్ హార్ట్ కల్చర్ సెక్రటరీ రాజశేఖర్ బాబు, అగ్రికల్చర్ కమిషనర్ శ్రీనివాసులురెడ్డి, జాయింట్ కలెక్టర్ జీ.విద్యాధరి పాల్గొన్నారు.

శ్రీ సిటీని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు



ట్రైనీ ఐఏఎస్‌లను సన్మానించిన శ్రీసిటీ ప్రతినిధులు

సత్యవేడు : ఏపీ దర్శన్ సీడీ టూర్‌లో భాగంగా 2- 24బ్యాచ్‌కు చెందిన ఏడుగురు ట్రైనీ ఐఏఎస్‌లు శనివారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీ సిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) శివశంకర్ వీరికి స్వాగతం పలికారు. శ్రీ సిటీ ప్రణాళిక, అత్యాధునిక మౌలిక సదుపాయాలు , సుస్థిర అభివృద్ధిపై వారికి ప్రదర్శన ఇచ్చారు. మేక్- ఇన్- ఇండియా మిషన్‌లో శ్రీసిటీ పాత్ర, భారీ ఉపాధి కల్పన, ఈ ప్రాంత ఆర్థిక వ్యవస్థకు ఎలా ఊతమిచ్చారనే అంశాలను వివరించారు. పర్యటనలో భాగంగా ట్రైనీ ఐఏఎస్‌లు శ్రీసిటీ పరిసరాలు సందర్శించారు. మెండెలెస్ (క్యాడ్‌బరీస్) డైకిన్, ఎయిర్ కండిషనింగ్ పరిశ్రమలను సందర్శించారు. ఇక్కడి ఉత్పత్తులు, పనితీరును తెలుసుకున్నారు. శ్రీ సిటీ ప్రణాళిక, అమలు, వ్యాపార అనుకూల వాతావరణాన్ని ప్రశ్నించిన ట్రైనీ ఐఏఎస్‌లు, ఇతరులు అనుసరించాల్సిన అద్భుత మోడల్‌గా దీనిని అభివర్ణించారు. ట్రైనీ ఐఏఎస్‌లే కాకుండా దేశ విదేశాలకు చెందిన అధికారులు, వ్యూహకర్తలు, నిర్వాహకులు, సాంకేతిక నిపుణులు తమ అధ్యయనానికి శ్రీసిటీని ఎంచుకోవడం తమకు గర్వకారణమని శ్రీ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పేర్కొన్నారు.

పల్లె ప్రగతికి.. చంద్రగ్రహణం!



దాసరపల్లె పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీలో రోడ్డుపై మురుగు నీరు

కూటమి నేతలు పల్లెపై పగబట్టారు. మౌలిక వసతులు కల్పించకుండా నాన్చుతున్నారు. మెజారిటీ సర్పంచ్‌లు వైఎస్సార్‌సీపీకి చెందిన వారే ఉండడంతో ఆ క్రెడిట్ వారికి ఎక్కడ వెళ్తుందోనని కుట్ర పన్నుతున్నారు. ఇందులో భాగంగానే మూడు నెలల క్రితం విడుదలైన 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు రూ.30.32 కోట్లు ఖర్చుచేయకుండా మోకాలడ్డుతున్నారు. పల్లెల్లో వసతులు కల్పించకుండా జనాలకు చుక్కలు చూపిస్తున్నారు.

మూడు నెలలు ముందే వచ్చిన 15వ ఆరిక్థ సంఘం నిధులు

- జిల్లాకు మొత్తం రూ.30.32 కోట్లు
- ఖర్చుచేయని కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లకు క్రెడిట్ వస్తుందని నాన్చుతున్న వైనం
- మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్న పల్లె జనం

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో మేజర్, మైనర్ గ్రామ పంచాయతీలన్నీ కలిపి 697 దాకా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం గత మార్చి లోనే 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ఖజానాకు జమచేసింది. పల్లెల్లో వసతులు కల్పించేందుకు మొత్తం రూ.30.32 కోట్లు దాకా సర్దుబాటు చేయాల్సి ఉంది. నెలలు గడుస్తున్నా కూటమి ప్రభుత్వం నిధులు విదల్చకుండా కాలయాపన చేస్తోంది. ఆర్థిక సంఘం నిధులు టైడ్, అన్‌టైడ్ విభాగాలుగా కేటాయిస్తారు. టైడ్ విభాగంలో పారిశుద్ధ్యం, తాగునీటి అవసరాలకు, అన్‌టైడ్ విభాగంలో రోడ్లు, మురుగు కాలువలు, శ్మశాన వాటికల అభివృద్ధి, విద్యుత్ మోటారు మరమ్మతులు, చెత్త సేకరించే కార్మికుల వేతనాల వంటి వాటికి ఖర్చు చేస్తారు. మేజర్ పంచాయతీలకు ఇంటి పన్నులు, చేపల చెరువుల వేలం, వారపు సంతలు, కాలువ గట్లు, ఏటిగట్ల పై కొబ్బరి చెట్ల ఫలసాయం ద్వారా వచ్చే ఆదాయం వంటివి ఉంటాయి. వీటితో పాటు మైనర్ పంచాయతీలకు సాధారణ నిధులు చాలా తక్కువగా ఉంటాయి. ఈ పంచాయతీల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచి తాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఆర్థిక సంఘం నిధులే దిక్కుగా మారాయి. ప్రభుత్వం ఈ నిధులు ఇవ్వకపోవడంతో మైనర్ పంచాయతీలు దిక్కుతోచని స్థితిలో పడ్డాయి.

నిధులెప్పుడిస్తారో

రాష్ట్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులివ్వకపోవడంతో అభివృద్ధి పనులు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. అనేక సమస్యలతో సర్పంచ్‌లు సతమతమవుతున్నారు. కేంద్రం నిధులిచ్చినా రాష్ట్ర ప్రభుత్వ దయ కోసం నెలల తరబడి ఎదురుచూస్తున్నారు. ఈ నిధులిస్తే గ్రామాల్లోని దళితవాడల్లో రోడ్లు, డ్రైన్ల అభివృద్ధికి, తాగునీటి సదుపాయాల కల్పనకు, చెల్లింపులకు అవకాశం దక్కేదని చెబుతున్నారు.

రాజకీయాలు తగునా బాబు?

గ్రామాల అభివృద్ధికి ఇబ్బందులు రానివ్వమని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చెబుతుంటారు. కానీ, ఆర్థిక సంఘం నిధుల విడుదలకు వచ్చే సరికి రాజకీయం చేస్తున్నారని పలువురు సర్పంచ్‌లు ఆరోపిస్తున్నారు. ఆర్థిక సంఘం నిధులను దారి మళ్లిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

ఎదురు చూస్తున్నాం



15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. మార్చిలో ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించింది. కానీ ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదు. ఆ నిధుల కోసం మూడు నెలలుగా వేచి చూస్తున్నాం.


– రజనీకాంత్, సర్పంచ్ వసంతాపురం

కంపు కొడుతున్న పల్లెలు



ఆర్థిక సంఘం నిధులు రాకపోవడంతో పల్లెలు కంపుకొడుతున్నాయి. ఎక్కడ చూసినా పరిసరాలు అధ్వాన్నంగా మారాయి. కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవు. అత్యవసర పనుల నిర్వహణ తలకు మించిన భారంగా మారింది.

– రవికుమార్, సర్పంచ్, బుగ్గ అగ్రహారం






గోపిశెట్టిపల్లెలో ప్రధాన రహదారి దుస్థితి, గుడిపాలలో పనిచేయని చేతిపంపు, గంగవరంలో మురుగు నీటిలో కొళాయి, ముదిపల్లెలో మరమ్మతుకు నోచుకోని కల్వర్టు

సమస్యలు ఇలా..

- పూతలపట్టు నియోజకవర్గం, యాదమరి మండలంలోని దాసరాపల్లె ఎస్టీ కాలనీలో రోడ్డు గుంతలమయంగా ఉంది.
- కమ్మపల్లె పంచాయతీలోని రసూల్‌నగర్‌లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది.
- కృష్ణంపల్లె పంచాయతీ నడిమూరులో డ్రైనేజీ వ్యవస్థ లేదు. చేతి పంపులు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి.
- జీడీనెల్లూరు నియోజకవర్గం, కార్వేటినగరం మండలం, గోపిశెట్టిపల్లె పంచాయతీలో కాలువను శుభ్రం చేయడం లేదు.
- చిత్తూరు నియోజకవర్గం, గుడిపాలలో చేతిపంపు పని చేయడం లేదు.
- పలమనేరు నియోజకవర్గం, గంగవరం మండలం, కలగటూరు పంచాయతీలో కాలువలు శుభ్రం చేయలేదు
- నగరిలోని ముదిపల్లె పంచాయతీలో కల్వర్టు మరమ్మతుకు నోచుకోలేదు
- పుంగనూరు, కుప్పం నియోజకవర్గాల్లోనూ అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయి

దోమల వ్యాప్తి అధికం



వర్షాకాలం మొదలయ్యింది. పారిశుద్ధ్యం పనులు చేపట్టకపోతే దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. శివారు ప్రాంతాలకు తాగు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే పైపులైన్ మరమ్మతులు చేపట్టాల్సి ఉంటుంది. అప్పులు చేసి ఖర్చు చేయాల్సి వస్తోంది.

– పద్మనాభరెడ్డి, సర్పంచ్ కృష్ణంపల్లె పంచాయతీ

నెలలో రావచ్చు



పంచాయతీ నిధులు నెల రోజుల్లోపు వచ్చే అవకాశం ఉంది. వీటి పై రాష్ట్ర పంచాయతీ అధికారులను సంప్రదించాం. నెల.. నెన్నర లోపు రావొచ్చని చెప్పారు. సాధారణ నిధుల నుంచి అత్యవసర పనులకు అవసరమైతే వాడుకోవాలని తెలియజేశాం.

– సుధాకర్‌రావు, డీపీఓ

అమ్మానాన్న లేని వాళ్లం!

'మేం ఏ జన్మలో ఎవరికి ఏ పాపం చేశామో అర్థం కావడంలేదు. చిన్న తనంలోనే ఆ దేవుడు తల్లిదండ్రులను తీసుకెళ్లిపోయాడు. అనాథలుగా రోడ్డున పడేశాడు. ఎలా ఉండాలో.. ఏం చేయాలో తెలియడం లేదు. అమ్మానాన్న లేకుండా ఎలా బతకాలో అర్థం కావడం లేదు..' అన్నట్టు ఆ చిన్నారులు వచ్చి పోయేవారిని దీనంగా చూస్తూ కన్నీళ్లు పెట్టుకోవడం కలచి వేసింది. ఈ ఘటన మండలంలోని మామిడిగుట్టపల్లెలో శనివారం చోటు చేసుకుంది.

- రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ దంపతులు మృతి
- అనాథలైన ఇద్దరు చిన్నారులు
- కన్నీరుమున్నీరైన బంధువులు

ఐరాల: చిత్తూరు– అరగొండ రోడ్డు బ్యాన్స్ హోటల్ సమీపంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దంపతులు మృత్యువాత పడ్డారు. చిన్నారులు అనాథలుగా మిగిలిపోయారు. బంధువుల కథనం మేరకు.. మండలంలోని మామిడిగుట్టపల్లెకు చెందిన రాజేష్(37)కు, తవణంపల్లె మండలం, తడకరకు చెందిన పూర్ణిమ(27)కు ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి హేమాన్(5), నిషాంత్(3) ఇద్దరు కుమారులు ఉన్నారు. రాజేష్ ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం తన స్వగ్రామం మామిడిగుట్టపల్లె నుంచి రాజేష్, పూర్ణిమ, పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంలో చిత్తూరుకు బయలుదేరారు. ఈ క్రమంలో బ్యాన్స్ హోటల్ సమీపంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద ఎదురుగా వస్తున్న ఓ లారీ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దంపతులతో పాటు చిన్నారులకు గాయాలయ్యాయి. తీవ్రగాయాలైన రాజేష్‌ను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. పూర్ణిమ పరిస్థితి విషమంగా ఉండడంతో రాణిపేట సీఎంసీకి తరలించారు. చిన్నారులుకు స్వల్ప గాయాలు కాగా చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రిలో చికిత్స అందించారు. ఈ క్రమంలో రాజేష్ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పూర్ణిమ శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. పెద్ద కుమారుడు హేమాన్ష్‌కు ఎడమ భుజం ఎముక విరగడంతో శస్త్ర చికిత్స అవసరమని డాక్టర్లు తేల్చారు. చిన్న కుమారుడు నిషాంత్ ఆరోగ్యం నిలకడగా ఉందని చెప్పారు.




పెద్ద కుమారుడు హేమాన్ష్ భుజం విరగడంతో కట్టుకట్టిన దృశ్యం, చిన్న కుమారుడు నిషాంత్



పూర్ణిమ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు



రాజేష్, పూర్ణిమ (ఫైల్),

కంటతడి పెట్టిన గ్రామస్తులు

రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోవడంతో ఆ ఇద్దరు చిన్నారులు అనాథలుగా మారారు. అమ్మానాన్న లేరని తెలిసి విలవిల్లాడిపోయారు. గుక్కపట్టి ఏడ్చుతున్న ఆ చిన్నారుల పరిస్థితిని చూసి స్థానికులు కంటతడి పెట్టుకున్నారు. దంపతుల రెండు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఏ ఇద్దరు కలిసినా వారిగురించే చర్చించుకోవడం కనిపించింది. పోస్టుమార్టం అనంతరం పూర్ణిమ మృతదేహాన్ని మామిడిగుట్టపల్లెకు తరలించి శనివారం అంత్యక్రియలు ముగించారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి



సంకటహర చతుర్థి వ్రతంలో భక్తులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానంలో శనివారం సంకటహర చతుర్థి గణపతి వ్రతాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. చతుర్థి సందర్భంగా ఉదయం ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలకు సుగంధ పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆలయ అధికారులు ఉత్సవమూర్తులను మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి ఆస్థాన మండపంలో కొలువుదీర్చారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు శాస్త్రోక్తంగా సంకటహర చతర్థి గణపతి వ్రత్రాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వ్రతాన్ని ఆచరించారు. ఈవో పెంచలకిషోర్ పాల్గొన్నారు.

స్వర్ణరథంపై ఊరేగింపు

కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి రాత్రి ఆలయ మాడవీధుల్లో స్వర్ణ రథం ఊరేగారు. తొలుత అలంకార మండపంలో ఉత్సవ విగ్రహాలకు వేద పండితులు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామి వారి స్వర్ణ రథంలో కొలువు దీర్చారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి స్వర్ణ రథం ఆలయ మాడవీధుల్లో దిగ్విజయంగా ఊరేగుతూ కనువిందు చేసింది. భక్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.



ఊరేగుతున్న స్వర్ణరథం


అన'కొండ'లు!

- నాయనిచెరువు కొండపై కూటమి నేతల కన్ను
- విలువైన గ్రానైట్ కొట్టేసే యత్నం
- గ్రానైట్ బండలు తమిళనాడుకు తరలింపు

సాక్షి టాస్క్‌ఫోర్స్: చిత్తూరు మండలం, నాయనిచెరు వు గ్రామ సమీపంలోని ఓ కొండను కూటమి నేతలు కూల్చేస్తున్నారు. విలువైన గ్రానైట్‌ను కాజేస్తున్నారు. కొండను బద్దలు కొట్టి యథేచ్ఛగా తమిళనాడుకు తరలిస్తున్నారు. బ్లాక్ బండ మీటరు రూ.24 నుంచి రూ.25 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇలా రోజుకు రూ.5 లక్షల వరకు దండుకుంటున్నారు. గ్రానైట్ వాహన రాకపోకల వల్ల రాత్రి పూట ఇబ్బందికరంగా మారింది. నాటు బాంబులు పేల్చి నిద్రలేకుండా చేస్తున్నారని సమీప గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమార్కుల ధాటికి అడవి జంతువులు కూడా ఊళ్ల మీదకు వస్తున్నాయని వాపోతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే ప్రజాప్రతినిధుల పేరు చెప్పి అక్రమార్కులు బయపెడుతున్నట్టు వారు పేర్కొంటున్నారు.

వారానికి రూ.50 వేలు

సంబంధిత శాఖ అధికారులకు వారం వారం రూ.50 వేల చొప్పున మామూళ్లు ఇస్తున్నట్టు తెలుస్తోంది. ఈక్రమంలోనే కొండను తవ్వేస్తున్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, లేనిపక్షంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని స్థానికులు చెబుతున్నారు. దీనిపై మైనింగ్ శాఖ అధికారి ఏడీ సత్యనారాయణను వివరణ కోరగా పెద్దిశెట్టిపల్లిది కూడా ఫిర్యాదు వచ్చింది.. నాయని చెరువులో జరుగుతున్న క్వారీని కూడా పరిశీలిస్తాం.. అనుమతి లేదని తేలితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.



నాయనిచెరువలో క్వారీ తవ్వకాలు

వరసిద్ధుని సేవలో పలువురు ప్రముఖులు




చైర్మన్ రాజశేఖర్, సీబీఐ డీఐజీ

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రాజశేఖర్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీ.ఆర్ మధుసూదన్‌రావు, రాష్ట్ర సీబీఐ డీఐజీ మురళిరంభ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేద ఆశీర్వచన మండపంలో పండితులు వారికి ఆశీర్వచనాలు అందజేయగా ఈవో పెంచలకిషోర్ వారికి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

వెండి దీపం.. నైవేద్య పాత్రల వితరణ



వెండి పాత్రలు విరాళంగా అందజేస్తున్న దాతలు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానానికి శనివారం ఓ దాత కుటుంబీకులు వెండి పాత్రలు విరాళంగా అందజేశారు. తిరుపతికి చెందిన చంద్రశేఖర్ కుటుంబీకులు రూ.3.80 లక్షల విలువ చేసే 3.5 కిలోల వెండి దీపం, నైవేద్య పాత్రలు విరాళంగా ఈవో పెంచల కిషోర్‌కు అందజేశారు. అనంతరం వారికి దర్శన భాగ్యం కల్పించారు.

మెకానిక్ ఆత్మహత్యాయత్నం



పుంగనూరులో చికిత్స పొందుతున్న ప్రకాష్

చౌడేపల్లి: మండలంలోని గోసులకురప్పల్లె గ్రామానికి చెందిన రమణ కుమారుడు ప్రకాష్(36) మెకానిక్‌షాపు నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ప్రకాష్ పలువురి వద్ద అప్పులు చేశాడు. అప్పుల వారి వేధింపులు అధికం కావడంతో శనివారం పంట పొలాలకు ఉపయోగించే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. కుటుంబీకులు అతన్ని పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్థానిక పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న కుమార్

పుంగనూరు(చౌడేపల్లె) : కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన పుంగనూరు మండలంలోని నల్లూరుపల్లె గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అగస్టీ కుమారుడు కుమార్(30) శనివారం పురుగుల మందుతాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు 108 సహాయంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపటి నుంచి డిగ్రీ, పీజీ తరగతులు

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలోని అన్ని డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం నుంచి తరగతులు పునఃప్రారంభం కానున్నాయి. ఆయా కళాశాలలో అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. కళాశాలలతో పాటు అదే రోజు వసతి గృహాలు సైతం తెరుచుకోనున్నట్లు అధికారులు తెలిపారు. పద్మావతి మహిళా వర్సిటీలో సైతం తరగతులు ప్రారంభం కానున్నాయి. టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్పీడబ్ల్యూ, ఎస్‌జీఎస్, ఎస్వీ ఆర్ట్స్, ఎస్వీ ఓరియంటల్ కళాశాలలు సోమవారం నుంచి తరగతులు పునఃప్రారంభం కానున్నాయి.

చివరి దశకు అయ్యోర్ల బదిలీలు

- బదిలీల్లో పలువురు టీచర్లకు అన్యాయం
- సమస్యల పరిష్కారానికి కుప్పలు తెప్పలుగా గ్రీవెన్స్‌లు
- నేటితో ప్రక్రియ ముగించేలా విద్యాశాఖ కసరత్తు



షర్మన్ బాలికోన్నత పాఠశాలలో ఆఖరి దశలో నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ ప్రక్రియ

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో టీచర్ల బదిలీలు, ఉద్యోగోన్నతుల కసరత్తు చివరి అంకానికి చేరింది. గత వారం రోజులుగా జరుగుతున్న ఈ ప్రక్రియ అయ్యోర్లకు చుక్కలు చూపించింది. కూటమి ప్రభుత్వం ఇష్టానుసారంగా నిబంధనలు పెట్టడంతో పలువురు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా పలు నిబంధనలను బదిలీల ప్రక్రియలో అమలు చేశారు. స్పౌజ్‌ల విషయంలో అనేక ఇబ్బందులు సృష్టించారు.

నేటితో ముగియనున్న ప్రక్రియ

జిల్లా కేంద్రంలోని షర్మన్ బాలికోన్నత పాఠశాలలో బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ ఆదివారంతో ముగియనుంది. ఈ నెల 14వ తేదీన సీరియల్ నం.2000 నుంచి 3000 వరకు కౌన్సెలింగ్ చేపట్టారు. అనంతరం మైనర్ మీడియా ఎస్జీటీల కౌన్సెలింగ్‌కు తక్కువ మంది ఉండడంతో ఆదివారంతో ప్రక్రియ ముగించేందుకు విద్యాశాఖ అధికారులు కసరత్తు చేపట్టారు. సీనియారిటీ జాబితాల్లో తప్పిదాలు, వింత నిబంధనల వల్ల మెజారిటీ శాతం ఉపాధ్యాయులు బదిలీల్లో నష్టపోయారు. కూటమి సర్కారు పాలనలో నష్టపోయామంటూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని టీచర్లు మండిపడుతున్నారు.

కుప్పలు తెప్పలుగా గ్రీవెన్స్

బదిలీల ప్రక్రియలో నష్టపోయిన టీచర్లకు న్యాయం చేస్తామని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు బాధిత టీచర్ల నుంచి గ్రీవెన్స్ తీసుకోవాలంటూ జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. దీంతో జిల్లాలో దాదాపు 180 ఎస్జీటీ, 75 దాకా స్కూల్ అసిస్టెంట్ల నుంచి గ్రీవెన్స్‌కొచ్చాయి. వీటిని ఎప్పుడు పరిష్కరిస్తారో తెలియని పరిస్థితి.

పరామర్శిస్తూ..భరోసానిస్తూ..



వెదురుకుప్పం: ఆళ్లమడుగులో కేశవులు రెడ్డికి నివాళి అర్పిస్తున్న మాజీ డెప్యూటీ సీఎం నారాయణస్వామి



కమ్మకండ్రిగలో తులసీ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ డెప్యూటీ సీఎం

వెదురుకుప్పం: కర్ణాటక రాష్ట్రం, హోస్కోట వద్ద గురువారం రాత్రి జరిగిన బస్సు ప్రమాదంలో జీడీ నెల్లూరు నియోజకవర్గానికి చెందిన ఐదుగురు మృత్యువాత పడ్డారు. దీంతో విషాద ఛాయలు అలముకున్నాయి. వెదురుకుప్పం మండలంలోని ఆళ్లమడుగు, శ్రీరంగరాజపురం మండలంలోని కమ్మకండ్రిగ, గంగాధరనెల్లూరు మండలంలోని మారేడుపల్లె గ్రామాల్లో బాధిత కుటుబాలు పుట్టెడు దుఃఖంలో మునిగిపోయారు. మృతదేహాలు శుక్రవారం ఆయా గ్రామాలకు చేరుకోగా.. శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఆయా బాధిత కుటుంబాలను మాజీ డెప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి పరామర్శించారు. వెదురుకుప్పం మండలంలోని ఆళ్లమడుగు గ్రామంలో శనివారం పర్యటించిన ఆయన కేశవులురెడ్డి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అదే గ్రామంలో జనార్దన్‌కు గాయాలయ్యాయి. ఆయన కుమారుడు (45 రోజులు) చనిపోవడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీరంగరాజపురం మండలంలోని కమ్మకండ్రిగలో పర్యటించి తులసీ మృతదేహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. జీడీ నెల్లూరు మండలంలోని మారేడుపల్లె గ్రామంలో శారద పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. అదేవిదంగా గాయాలైన వారిని కూడా పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి(వెదురుకుప్పం), ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు బట్టే సుబ్రమణ్యం, బొమ్మయ్యపల్లె ఎంపీటీసీ భాస్కర్, మాజీ ఎంపీటీసీలు ధనంజయరెడ్డి, ఎర్రయ్య, మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ లోకనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు దేవరాజారెడ్డి, హరినాథ్ ఉన్నారు.

మాజీ సీఎం దృష్టికి తీసుకెళతా!

బస్సు ప్రమాద ఘటనను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళతానని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి స్పష్టం చేశారు. బాధిత కుటుంబాలను పరామర్శించిన అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడి బాధిత కుటుంబాల పరిస్థితి, ఇతరత్రా విషయాలపై ఆరా తీశారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారికుటుంబాలను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి డిమాండ్ చేశారు. మృతి చెందిన ఒక్కో కుటుంబానికి రూ.50 లక్షలు, ప్రమాదంలో గాయపడిన వారికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.

రోడ్డెక్కిన మామిడి రైతులు



టోకెన్ కోసం కర్మాగారం ఎదుట వేచి ఉన్న మామిడి రైతులు



వీల్ చైర్‌లో ఎదురు చూస్తున్న దివ్యాంగుడు

గంగాధర నెల్లూరు: గిట్టుబాటు ధర కోసం మామిడి రైతులు రోడ్డెక్కారు. కర్మాగారాల యాజమాన్యాల తీరుపై శనివారం నిరసనకు దిగారు. చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిలోని జైన్ మామిడి గుజ్జు పరిశ్రమ తీరుపై విరుచుకుపడ్డారు. తోతాపురి కిలో రూ.8కి కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించానా ఫ్యాక్టరీ యాజమాన్యం రూ.6 కొనుగోలు చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ మేరకు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. టోకెన్ వ్యవస్థను రద్దుచేసి సీరియల్‌గా ముందు వచ్చే రైతుల మామిడి పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సిఫారసుల టోకన్లే అధికంగా ఉన్నాయని మండిపడ్డారు. కాయ కుళ్లిపోక ముందే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారుల స్పందిస్తూ సోమవారం నుంచి సీరియల్‌గా ఎవరు ముందు వస్తే వారి పంటను కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండాయి. క్యూలైన్ కృష్ణ తేజ అతిథి గృహం వద్దకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 75,096 మంది స్వామివారిని దర్శించుకోగా 36,262 మంది భక్తులు తలనీ లాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.93 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది.

భాషా పండితుల బదిలీల్లో చిత్ర విచిత్రాలు

– నేడు డీఈవో కార్యాలయం వద్ద ధర్నా



పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

చిత్తూరు కలెక్టరేట్ : చాలా సంవత్సరాలుగా డీఈవో పూల్‌లో పెట్టి ఇబ్బందులు పెట్టారు. ఈ బదిలీల్లో అయినా దరఖాస్తు చేసుకుని అనుకూలమైన ప్రాంతాలకు వెల్దామని ఆశపడ్డారు. విద్యాశాఖ అధికారులు జారీ చేసిన సీనియారిటీ జాబితా ప్రకారం ఆన్‌లైన్‌లో బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని వివిధ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న భాషా పండితుల బదిలీల ఉత్తర్వులను రాష్ట్ర విద్యాశాఖ అధికారులు శనివారం విడుదల చేశారు. ఆ ఉత్తర్వులను చూసిన భాషాపండితులు నివ్వెరపోయారు. నిబంధనలకు విరుద్ధంగా బదిలీల ఉత్తర్వులు రావడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆన్‌లైన్ బదిలీలపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయని భాషాపండితులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నాకు సిద్ధమయ్యారు.

నిబంధనలకు వ్యతిరేకంగా బదిలీ ఉత్తర్వులు

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని డీఈవో పూల్‌లో ఉన్న తెలుగు 123, హిందీ 30 మంది భాషాపండితుల ఉత్తర్వులు నిబంధనలకు వ్యతిరేకంగా విడుదల చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. ఫైనల్ సీనియారిటీ జాబితాలో సీరియల్ నెంబర్ 15లో ఉన్న వ్యక్తి తన స్పౌజ్ తిరుపతిలో పనిచేస్తున్నారు. ఆన్‌లైన్ బదిలీల్లో ఆ టీచర్ తిరుపతిని ఆప్షన్‌గా పెట్టుకున్నారు. అయితే ఆ టీచర్ తన ప్రాధాన్యత క్రమంలో పెట్టిన 30వ ప్లేస్ పెనుమూరుకు పోస్టింగ్ ఇచ్చారు. అదే విధంగా సీరియల్ నెంబర్ 17లో ఉన్న మరో భాషాపండితుని స్పౌజ్ తిరుపతిలో పనిచేస్తుండగా ప్రాధాన్యత క్రమంలో తిరుపతిని రెండవ ప్లేస్‌లో పెడితే చివరగా పెట్టిన వరదయ్యపాళ్యంకు బదిలీ చేశారు.

దారుణం

తుది సీనియారిటీ జాబితాలో 79వ నెంబర్‌లో ఉన్నటువంటి భాషాపండితునికి తన ప్రాధాన్యత క్రమం ప్రకారం కాకుండా ఇంటికి దగ్గరలో ఉన్న తిరుపతిలో పోస్టింగ్ ఇచ్చారు. ఇదేవిధంగా చాలా మందికి తుది సీనియారిటీ జాబితాల్లో కింద ఉన్న వారికి దగ్గరలో, మొదట్లో ఉన్న వారికి దూరంగా పోస్టింగ్‌లు ఇచ్చారు. ఈ సమస్యలపై ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నష్టపోయిన భాషాపండితులు కూటమి టీడీపీ నిలువునా ముంచేసిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దారుణం అంటూ సామాజిక మాధ్యమాల్లో తమ వ్యతిరేకతను వెల్లడిస్తున్నారు. సీనియారిటీ జాబితాల్లో 1, 2 స్థానాల్లో ఉన్న వారికి 30, 40వ ప్లేసుల్లో బదిలీ చేయడం వింతగా ఉందని మండిపడుతున్నారు. న్యాయం కోసం ఆదివారం డీఈవో కార్యాలయం వద్ద ధర్నా చేసేందుకు భాషా పండితులు సిద్ధపడ్డారు.

కారు ఢీ - మహిళ మృతి




మృతి చెందిన సవిత, గాయపడిన చందర్



రోడ్డు ప్రమాదంలో దెబ్బ తిన్న కారు

రొంపిచెర్ల: కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన బెంగళూరు–తిరుపతి జాతీయ రహదారిలోని రొంపిచెర్ల మండలం, బోనంవారిపల్లె వద్ద శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాలు.. కర్ణాటక రాష్ట్రం, చింతమణి నరిసింగపేటకు చెందిన ఎస్‌వీ. సవిత (56), చందర్ (38) ద్విచక్ర వాహనంలో తిరుపతికి బయల్దేరారు. అక్కడ శనివారం రాత్రి జరగనున్న శుభాకార్యంలో పాటల కచ్చేరి కార్యక్రమానికి హాజరు కానున్నారు. ఈ క్రమంలో తిరుపతి వైపు నుంచి కారు పీలేరు వైపు వెళ్తూ బోనంవారిపల్లె వద్ద ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సవిత(56) అక్కడికక్కడే మృతి చెందగా.. చందర్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108లో చికిత్స కోసం అన్నమ్మయ్య జిల్లా పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రొంపిచెర్ల ఎస్ఐ సుబ్బారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం తీసిన మురుగు నీటి గుంత

– మురికి గుంతలో పడి చిన్నారి మృతి




గుంతలో పడి మృతి చెందిన చిన్నారి, ప్రమాదానికి కారణమైన మురుగు నీటి గుంత

రొంపిచెర్ల: మురుగు నీటి గుంత ఓ చిన్నారి ప్రాణాలు తీసింది. ఈఘటన రొంపిచెర్ల గ్రామ పంచాయతీలోని లక్ష్మీనారాయణ కాలనీలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. గ్రామానికి చెందిన ఆసిఫ్, ఉస్మా కుమార్తె ఆజూమిర్జ(3) పిల్లలతో వీధిలో ఆడుకుంటున్నారు. వీరు ఆడుకుంటున్న రోడ్డు పక్కనే మురుగు నీటి గుంత ఉంది. ప్రమాదవశాత్తు ఆ గుంతలో చిన్నారి పడింది. పిల్లలు కేకలు వేయడంతో గ్రామస్తులు హుటాహుటిన గుంత వద్దకు చేరుకున్నారు. అప్పటికే చిన్నారి ప్రాణాలు వదిలింది. గుంత ఆరు అడుగుల లోతు ఉండడంతో ఊపిరాడక మృతిచెందింది. తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఘటనా స్థలాన్ని రొంపిచెర్ల పోలీసులు సందర్శించి వివరాలను సేకరించారు. ఇదిలావుండగా వారం క్రితమే ఈ గుంతను జేసీబీతో మరింత పెద్దది చేశారు. అయినా పూడ్చకపోవడంతో చిన్నారి ప్రాణాలు బలితీసుకుంది.

కాణిపాకం కిటకిట



భక్తులతో నిండిపోయిన ఆలయంలోని క్యూలు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శనివారం భక్తులతో కిక్కిరిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు పోటెత్తారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర, వీఐపీ దర్శనాలతో ఆలయమంతా భక్త జన సందడి కనిపించింది. క్యూలైన్లు నిండి ఆలయ ఆవరణలో భక్తులు బారులుతీరారు. ఎండను సైతం లెక్కచేయకుండా భక్తులు ఆలయ ఆవరణలో స్వామి వారి దర్శనానికి గంటల కొద్దీ నిరీక్షించారు. స్వామివారి దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో పెంచల కిషోర్ చర్యలు చేపట్టారు.